بِسمِ اللهِ الرَّحمٰنِ الرَّحِیم نَحمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُولِهِ الکَرِیم وَعَلٰی عَبدِهِ المَسِیحِ المَوعُود

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 02.09.2022 (Telugu)**

# హజ్రత్ అబూబక్ర్ (రజి) హయాంలో అరబ్ బయట దౌర్జన్యమునకు పాల్పడుతున్న వ్యతిరేకులతో జరిగిన యుద్ధముల ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 02.09.2022 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

**అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లా షరీకలహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు. అమ్మా బఅదు ఫఅవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్- బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం - అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ - అర్రహ్మా నిర్రహీం - మాలికి యౌమిద్దీన్- ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్ - ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ- సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహిం ఘైరిల్ మఘ్జూబి అలైహిం వలజ్జాల్లీన్. (ఆమీన్)**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ అబూబక్ర్ (రజి) కాలములోని యుద్ధముల ప్రస్తావన జరుగుతుండెను. ఇదే క్రమంలో హిజ్రి 13వ సం॥లో జరిగిన దమిష్క్ విజయము గురించి కొన్ని వివరములు తెలిపెదను. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) హయాంలో జరిగిన చివరి యుద్ధమిది.

హజ్రత్ అబూబక్ర్ (రజి) సిరియా వైపు వివిధ సైన్యములను పంపినారు. హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి)ను ఒక సైన్యమునకు అధ్యక్షునిగా నియమించి దమిష్క్ సమీపములో సిరియాలోని ఒక ప్రాచీన, ప్రఖ్యాత, పెద్ద నగరమైన హిమస్ చేరుకోవాలని ఆదేశించిరి. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఆదేశముతో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దమిష్క్ చేరుకొని ఇతర ఇస్లామీ సైన్యములతో కలిసి దానిని ముట్టడించిరి. ముట్టడించి ఇరవై రోజులు గడిచినను ఎలాంటి ఫలితము వెలువడలేదు. ఇంతలోనే హర్ఖిల్ చక్రవర్తి అజ్నాదీన్‌కు సమీపములో ఒక పెద్ద సైన్యమును సమకూర్చినట్లు ముస్లిములకు సమాచారమందినది. ఈ వార్త తెలియగానే హజ్రత్ ఖాలిద్ (రజి) ఉత్తర ద్వారము గుండా బయలు దేరి జాబియ ద్వారము వైపున హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) వద్దకు చేరుకొనిరి. పరిస్థితిని మొత్తం వివరించి తమ అభిప్రాయమును ఇట్లు వెల్లడించిరి. దమిష్క్ ముట్టడిని వదిలి అజ్నాదీన్‌లో వున్న రోముల సైన్యమును ఎదుర్కొనవలెను. అల్లాహ్ మనకు విజయము అందించినచో మనము ఇక్కడికి మరల తిరిగి రావచ్చును. హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) ఇట్లు తెలిపిరి. నా అభిప్రాయము ఇందుకు భిన్నంగా వున్నది. హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) సలహాతో ఏకీభవిస్తు హజ్రత్ ఖాలిద్ (రజి) ముట్టడిని కొనసాగించిరి. ఇలా ముట్టడికి 21 రోజులు గడిచినవి. తీవ్రంగా దాడి చేయాలని ముస్లిములకు సూచిస్తూ హజ్రత్ ఖాలిద్ (రజి) స్వయంగా ఉత్తర ద్వారము గుండా వరుసగా దాడులు చేసిరి. ఇలా యుద్ధము చేస్తుండగానే ఏమి చూశారనగా కోట గోడపై వున్నటువంటి రోములు ఒక్కసారిగా చప్పట్లు కొడుతూ నృత్యము చేస్తూ ఆనందమును వ్యక్తపరుస్తున్నారు. ముస్లిములు ఆశ్చర్యముతో వారిని చూడసాగిరి. హజ్రత్ ఖాలిద్ (రజి) ఒక వైపు చూడగా పెద్ద ఎత్తున దుమ్ము ధూళి లేస్తున్నట్లు కనపడుతుండెను. దాని వలన ఆకాశము వరకు చీకటి పడెను. అనగా పగలే మొత్తం చీకటి కనిపిస్తుండెను. దమిష్క్ వాసులకు హర్ఖిల్ చక్రవర్తి నుండి సహాయముగా సైన్యము వస్తున్నదని వారు (రజి) వెంటనే అర్థము చేసుకొనిరి.

హజ్రత్ ఖాలిద్ (రజి) తక్షణమే పరిస్థితి మొత్తమును హజ్రత్ అబూఉబైదహ్ (రజి)కు తెలుపుతూ

ఇట్లనిరి. మొత్తం సైన్యమును తీసుకొని హర్ఖిల్ చక్రవర్తి పంపిన సైన్యమును ఎదురించుటకు వెళ్ళాలని నేను భావిస్తున్నాను. ఇందులో మీ సలహా ఏమిటి? హజ్రత్ అబూ ఉబైదహ్ (రజి) ఇట్లనిరి. ఇది సమంజసం కాదు. ఎందుకనగా మనము ఈ స్థలమును విడిచిపెట్టినచో కోటలోని ప్రజలు బయటకు వచ్చి మనతో యుద్ధము చేయుదురు. మనము రోముల రెండు సైన్యముల మధ్య చిక్కిపోయెదము. హజ్రత్ ఖాలిద్ (రజి) మరల అభిప్రాయము కోరగా వారు (రజి) ఇట్లనిరి. మీరు ఒక వీరుడైన గొప్ప వ్యక్తిని ఎన్నుకొని అతని వెంట వంద సైనికులను ఇచ్చి రోముల సైన్యమును ఎదురించుటకు పంపించుము. మరొక కథనములో సైనికుల సంఖ్య ఐదు వేలని ప్రస్తావించబడెను.

ముస్లిములు చాలా వీరోచితంగా రోముల సైన్యముపై వరుసగా దాడి చేసిరి. రోముల సైన్యాధాకారి కుమారుడు హజ్రత్ జిరార్ (రజి)పై దాడి చేసి, బర్ఛీతో వారి (రజి) ఎడమ చెయ్యిపై కొట్టెను. తద్వారా వేగంగా రక్తము ప్రవహించసాగెను. కాని ఒక్క క్షణం తర్వాతనే వారు (రజి) అతని గుండెపై బర్ఛీతో దాడి చేసి అతనిని హతమార్చిరి. బర్ఛీ అతని యదలో ఇరుక్కుపోయెను. దాని ముళ్లు అతని యదలోనే విరిగి పోయెను. రోముల సైనికులు వారి (రజి) మొండి బర్ఛీని చూసి వారి (రజి)పై విరుచుకుపడి వారిని బంధించిరి. ఈ వార్త హజ్రత్ ఖాలిద్ (రజి)కు తెలియగానే వారు తీవ్ర ఆందోళనకు గురైరి. సహచరులతో రోముల సైన్యము గురించి తెలుసుకొని హజ్రత్ అబూఉబైదహ్ (రజి)తో సలహా తీసుకొనగా వారిట్లనిరి. దమిష్క్ ముట్టడికి తగిన చర్యలు చేపట్టి మీరు (రజి) దాడి చేయవచ్చును.

ఇంతలోనే సైన్యమునకు ముందట ఎర్రటి అశ్వముపై సవారి అయి రక్షణ కవచ వస్త్రము ధరించిన ఒక తెలియని అశ్వరోహణుని వారు చూసిరి. వారి నడవడిక చూసి చాలా వీరత్వము, వివేకము, యుద్ధ అనుభవము స్పష్టంగా కనిపిస్తుండెను. ఈ అశ్వరోహణుడు ఎవరో నాకు తెలిసినచో బాగుండునని హజ్రత్ ఖాలిద్ (రజి) ఆశిస్తుండిరి. ముస్లిముల సైన్యము అవిశ్వాసుల దగ్గరికి చేరినప్పుడు అతడు ఎంతో వేగంగా రోములపై దాడి చేసెను. అనగా గద్ద పక్షులపై దాడి చేసినట్లు దాడి చేసెను. వాస్తవానికి అతని దాడి వల్లనే శత్రువుల సైన్యములో విపరీతమైన ఆందోళన ఏర్పడెను. హతుల గుట్టలను పేర్చెను. హజ్రత్ ఖాలిద్ (రజి) చాలా ఆత్రుతతో పదే పదే ప్రశ్నించగా అతడిట్లు వేడుకొనెను. నేను జిరార్ సోదరి ఖౌల బిన్తె అజ్వర్‌ను. సోదరుడు బంధించబడినట్లు తెలియగానే నేను మీరు చూసినదే చేశాను.

హజ్రత్ ఖాలిద్ (రజి) భారీ ఎత్తున దాడి చేసినందున రోములు వెనక్కి తగ్గిరి. వారి సైన్యము చెల్లా చెదురయ్యెను. వీరత్వమును ప్రదర్శించిన హజ్రత్ రాఫె (రజి)తో హజ్రత్ ఖాలిద్ (రజి) ఇట్లనిరి. మీకు రహదారులు తెలుసు. హిమస్‌కు చేరుకోకముందే మీకు నచ్చిన యువకులను తీసుకొని హజ్రత్ జిరార్ (రజి)ను విడిపించుకొని వచ్చి తమ దేవుని వద్ద ప్రతిఫలము పొందుము. వారు బయలు దేరుతుండగా హజ్రత్ ఖౌల (రజి) సైతం చాలా బతిమలాడి వారి వెంట బయలు దేరుటకు అనుమతి పొందిరి. అనంతరం దాడి ఫలితముగా హజ్రత్ జిరార్ (రజి)ను విడిపించుకొని వచ్చిరి.

రెండవ వైపు ఇస్లామీయ సైన్యము దమిష్క్‌లో వుండగా కోటను మరోసారి చుట్టుముట్టెను. బస్రా నుండి హజ్రత్ ఇబాద్ బిన్ సయీద్ (రజి) హజ్రత్ ఖాలిద్ (రజి) వద్దకు వచ్చి, ఇట్లు సమాచారమందించిరి. రోములు 90 వేల సైన్యమును అజ్నాదీన్‌లో సమకూర్చుకున్నారు. హజ్రత్ అబూఉబైదహ్ (రజి) తో హజ్రత్ ఖాలిద్ (రజి) అభిప్రాయము తీసుకొనిరి. వారిట్లు సలహా ఇచ్చిరి. మన సైన్యము సిరియాలో వివిధ ప్రాంతములలో విడి విడిగా వున్నది. వారందరు అజ్నాదీన్‌కు రావాలని వారికి ఉత్తరములు వ్రాయండి. మనము కూడ దమిష్క్ కోట ముట్టడిని విడిచి అజ్నాదీన్ వైపు వెళ్లిపోదాం. ఇటు ముస్లిముల సైన్యము బయలు దేరగానే అటు దమిష్క్ వాసులు హర్ఖిల్‌కు నమ్మినబంటు అయిన గొప్ప విల్లు కారుడు

బూలస్ అనే వ్యక్తి వద్ద గుమికూడిరి. అతడు ఇంతకు ముందు ఏ ఒక్క యుద్ధములో కూడ సహాబాలు (అనుచరుల)తో తలపడలేదు. అతణ్ణి తమ అధ్యక్షునిగా చేసుకొనిరి. అతనికి అన్ని రకాల ఆశలు చూపించి యుద్ధము కొరకు సన్నద్ధం చేసిరి. అతడు ఆరు వేల సవారీలైన సైనికులు, పది వేల పాద సైనికులను తీసుకొని ఎంతో వేగంగా ముస్లిములతో తలపడుటకు బయలు దేరెను. అబూఉబదహ్ బూలస్‌తో యుద్ధము చేస్తుండగా వివిధ ప్రాంతముల నండి వచ్చిన ముస్లిం సైన్యములు మూకుమ్మడిగా దాడి చేయడంతో దమిష్క్ నుండి వచ్చిన రోముల సైన్యము తమకు అవమానము ఇక తప్పదని నమ్మెను. హజ్రత్ జిరార్ (రజి) నిప్పు రవ్వ వలె బూలస్ వైపు పరుగెత్తుతుండిరి. అతడు వీరిని చూసి గుర్తు పట్టి వణుకసాగెను. పాదాలతోనే పారిపోయెను. వారు (రజి) అతనిని వెంబడించి ప్రాణాలతో పట్టుకొనిరి. ఈ యుద్ధములో అవిశ్వాసుల ఆరు వేల మందిలో కేవలం వంద మంది అతికష్టంగా బ్రతికి వుండవచ్చును. రెండవ వైపు బూలస్ సోదరుడు బుత్రస్ పాద సైనికులతో స్త్రీల వైపు వెళ్లెను. కొందరు స్త్రీలను బంధించి దమిష్క్ వైపు తిరిగి పోయెను. హజ్రత్ ఖౌల (రజి) బంధించబడడంతో హజ్రత్ జిరార్ (రజి) తీవ్ర ఆందోళనకు గురైరి. అందుకు హజ్రత్ ఖాలిద్ (రజి) వారిని ఓదార్చిరి. రెండు వేల సైనికులను తమ వెంట తీసుకొని మిగతా సైన్యమును మొత్తం హజ్రత్ అబూఉబైదహ్ (రజి)కు అప్పగించిరి. ఇలా స్త్రీల రక్షణకు తగిన ఏర్పాట్లు చేసి తాము కూడ బంధించబడిన స్త్రీల అన్వేషణకు బయలు దేరిరి.

స్త్రీలను బంధించిన ప్రాంతమునకు చేరుకోగా అక్కడ దుమ్ము లేస్తున్నట్లు చూసిరి. ఇక్కడ యుద్ధము ఎందుకు జరుగుతుందని వారికి ఆశ్చర్యము కలిగెను. వాకబు చేయగా తెలిసినది ఏమనగా బుత్రస్ స్త్రీలను బంధించి నది వద్ద తన సోదరుడు బూలస్ రాక కొరకు నిరీక్షిస్తుండెను. అక్కడ వారు స్త్రీలను పంచుకోసాగిరి. ఈ స్త్రీలలో అధికులు వీరులు, అనుభవజ్ఞురాలులైన అశ్వరోహణులు, అన్ని రకాల యుద్ధము తెలిసినవారై వుండిరి. వీరు పరస్పరం ఒక చోట చేరుకొనిరి. హజ్రత్ ఖౌల (రజి) వారిని ఉత్తేజ పరుస్తు, పౌరుషం కలిగిస్తు వారిని ప్రతిఘటనకు రెచ్చగొట్టిరి. గుడారముల వాసాల సహాయంతో గొలుసుల కడియముల తరహాలో శత్రువులపై దాడి చేసిరి. ఈ స్త్రీల ధైర్యము, వీరత్వమును చూసి రోములు ఆశ్చర్యానికి గురైరి. శత్రువులు రెండవ సారి సన్నాహాలు చేసుకొనిరి. కాని ఇంకా దాడి చేయకముందే హజ్రత్ ఖాలిద్ (రజి) నాయకత్వములో ముస్లిములు అక్కడికి చేరుకొనిరి. బుత్రస్ ముస్లిములను చూడగా ఆందోళనకు గురై పారిపోసాగెను. హజ్రత్ జిరార్ (రజి) భీకరమైన విధంగా బర్ఛీతో దాడి చేసి అతనిని హతమార్చిరి. ఇలా బూలస్ కూడ తమ సోదరుని మరణ వార్త విని స్వంత కోరికతో హజ్రత్ ఖాలిద్ (రజి) చేతిలో హతమయ్యెను.

అజ్నాదీన్ విజయము తర్వాత హజ్రత్ ఖాలిద్ (రజి) ఇస్లామీయ సైన్యమును తీసుకొని మరల దమిష్క్ వైపు బయలు దేరాలని ఆదేశించిరి. అజ్నాదీన్‌లో రోముల సైన్యము పరాజయం పాలైన విషయము దమిష్క్ ప్రజలకు ముందుగానే తెలిసినది. కాని ఇస్లామీయ సైన్యము దమిష్క్ వస్తున్నదన్న విషయము తెలుసుకొని చాలా ఆశ్చర్యపడిరి. దమిష్క్ చుట్టు ప్రక్కల నివసించే ప్రజలు పారిపోయి కోటలో ఆశ్రయము పొందిరి. పెద్ద ఎత్తున ధాన్యము, అవసరమైన వస్తువులను సమకూర్చుకొనిరి. ఇంకా యుద్ధమునకు ఆయుధములు సైతం ప్రోగు చేసుకొనిరి. తద్వారా చుట్టుముట్టిన ప్రజలపై దాడి చేయాలని వారు భావించిరి. ఇస్లామీయ సైన్యము దమిష్క్ సమీపములో విడిది చేసెను. అనంతరం ముందుకు కదిలి కోటను చుట్టుముట్టిరి. దమిష్క్ నాయకులు, బుద్ధిమంతులు తమ పాలకుడు తౌమా (చక్రవర్తి హర్ఖిల్ అల్లుని)కి హిర్ఖిల్‌తో సహాయము కోరాలని లేదా ముస్లిములతో సంధి కుదుర్చుకోవాలని సలహా ఇచ్చిరి. కాని అతడు గర్వము, అహంకారముతో గట్టిగా ముస్లిములపై దాడి చేయాలని ఆదేశించెను. ఈ దాడుల వలన చాలా మంది ముస్లిములు గాయాల పాలై, అమరులైరి. వారిలోనే హజ్రత్ అబ్బాన్ బిన్

సయీద్ (రజి) కూడ వుండిరి. వారి నూతన వధువు హజ్రత్ ఉమ్మె అబ్బాన్ (రజి) ఎంతో ధైర్యము, నిలకడతో తీవ్రంగా యుద్ధము చేస్తూ తమ బాణములతో చాలా మంది రోములను హతమార్చెను. ఇలాగే అవకాశము లభించగానే తౌమా కంటిపై సూటిగా దాడి చేసి శాశ్వతంగా అతణ్ణి ఒక కంటి అంధునిగా మార్చిరి. తద్వారా తౌమా తన సైన్యముతో సహా తిరిగి కోటలో తల దాచుకోవలసి వచ్చెను.

ముస్లిములు దమిష్క్‌ను చాలా కఠినంగా చుట్టుముట్టిరి. తమకు ఇక సైనిక సహాయము లభించదని దమిష్క్ ప్రజలకు నమ్మకము కలిగెను. కావున వారిలో పిరికితనం, శక్తిహీనత కలిగెను. అందుకే మరింత పోరాటం నిలిపి వేసిరి. వారిని ఓడించాలనే తపన ముస్లిములలో అధికమయ్యెను. ఇలా ముట్టడి సుదీర్ఘమై పోయెను. హజ్రత్ ఖాలిద్ (రజి) దమిష్క్‌లో ప్రవేశించుటకు ఒక ఉపాయము ఇట్లు ఆలోచించిరి. కొన్ని తాళ్లను చుట్టి లోపల దిగుటకు ప్రయత్నించవలెను. ఆయా తాళ్లను మెట్ల వలె కట్టి లోపల దిగవలెను. ఇదే ఉపాయమును పాటిస్తూ ఇస్లామీయ సైన్యము దమిష్క్‌లో ప్రవేశించెను. నలుగురు ఇస్లామీయ నాయకులు నగరములోని కేంద్రములో పరస్పరం కలుసుకొనిరి. హజ్రత్ ఖాలిద్ (రజి) దమిష్క్‌లోని కొంత భాగమును జయించిరి. కాని హజ్రత్ అబూఉబైదహ్ (రజి) సంధి కుదుర్చుకొనిరి. అందుకే జయించిన ప్రాంతములో కూడ సంధి షరతులు వర్తించినవి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ అబూబక్ర్ (రజి) జీవిత ఇతర కోణములు తర్వాత ప్రస్తావించబడును. ఇన్‌షాఅల్లాహ్. హుజూరె అన్వర్ అయ్యదుల్లాహు తఆలా చివరలో గౌ॥ ఉమర్ అబూఅర్కోబ్ గారు దక్షిణ పాలస్తీనా మాజీ సదర్, ముట్టిలోని మొట్ట మొదటి అహ్మదీ గౌ॥ షేఖ్ నాసిర్ అహ్మద్ గారు ఆఫ్ థర్‌పార్‌కర్ సింధ్ పాకిస్తాన్, గౌ॥ మలిక్ సుల్తాన్ అహ్మద్ గారు మాజీ ముఅల్లిమ్ వఖ్ఫె జదీద్, గౌ॥ మహ్‌బూబ్ అహ్మద్ రాజేకీ గారు ఆఫ్ సాదుల్లాహ్‌పూర్ జిల్లా మండీ బహావుద్దీన్ పాకిస్తాన్ గారి సద్గుణములను ప్రస్తావించిరి. జుమా నమాజ్ తర్వాత వీరందరి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

**అల్ హందులిల్లాహి నహ్‌మదుహు వనస్తఈనుహు వనస్తఘ్‌ఫిరుహు వ నూమిను బిహి వ నతవక్కలు అలైహి వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా వ మిన్ సయ్యిఆతి ఆమాలినా మఁయ్యహ్‌దిహిల్లాహు ఫలా ముజిల్లలహు వమఁయ్యుజ్‌లిల్‌హు ఫలా హాదియలహు వనష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వనష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహు వ రసూలుహు. ఇబాదల్లాహి రహిమకుముల్లాహి ఇన్నల్లాహ యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఇయితా ఇజిల్ ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫహ్‌షాఇ వల్ మున్‌కరి వల్ బఘిఇ యఇజుకుం లఅల్లకుం తజక్కరూన్. ఉజ్‌కురుల్లాహ యజ్‌కురుకుం వద్‌వూహు యస్తజిబ్‌లకుం వలజిక్‌రుల్లాహి అక్బర్.**

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

| BOOK POST (PRINTED MATTER) | |
|---|---|
| From, | To, |
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |